ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టత ఇవ్వాలి
- లేదంటే 27న అమరణ దీక్ష చేపడుతాం
- మంత్రి సీతక్క వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్
- బీఆర్ఎస్ నేతలకు కృతజ్ఞతలు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 16: అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని.. లేదంటే ఈ నెల 27న అమర వీరుల స్తూపం వద్ద అమరణ నిరాహార దీక్ష చేపడుతామని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ స్పష్టంచేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశంపై మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీతక్క మంత్రి హోదాలో ఉండి పెండింగ్ బిల్లులపై గాలి మాటలు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని, నియోజకవర్గాల్లో శాసన సభ్యులను తిరగనివ్వబోమని హెచ్చరించారు. అలాగే అసెంబ్లీలో తమ పక్షాన మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే తాటి పెల్లి వెంకటరమణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, నేతలు చాకలి రమేశ్, గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, ఆరె మహేందర్, చిట్నేని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లు అడగడం తప్పా?

ముస్తాబాద్, డిసెంబర్ 16: గత ఐదేండ్లలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు అడగడం మేము చేసిన తప్పా? అని మండల మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక.. వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. మాజీ సర్పంచుల జేఏసీ శాసనసభ ముట్టడికి పిలుపునివ్వడంతో సోమవారం ఉదయం నుంచి మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్ట్ అక్రమం

చందుర్తి, డిసెంబర్16: గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరిన తమని అరెస్ట్ చేయడం అక్రమమని చందుర్తి మండల మాజీ సర్పంచులు ఆవేదన చెందారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా.. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇక్కడ మాజీ సర్పంచులు దుమ్ము అంజయ్య, చిలుక అంజిబాబు, మ్యాకల పరశురాములు, సిరికొండ శ్రీనివాస్, ఏనుగుల శ్రీనివాస్, భూమయ్య, తదితరులు ఉన్నారు.

బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 16: గ్రామాల్లోని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ ఉపాధ్యక్షుడు మాట్ల మధు డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ నేపథ్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో గనప శివజ్యోతి, సురభి సరితనవీన్‌రావు ఉన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఎన్ భీమ్యానాయక్

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

కలెక్టరేట్, డిసెంబర్ 16: ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ భీమ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కాగా, ప్రజావాణికి 79 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్, ఆయాశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

18న విధులకు హాజరు కాలేరు..

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో భాగంగా ఆశ కార్యకర్తలు ఈ నెల 18న విధులకు హాజరుకాలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బీ మంజుల ఆధ్వర్యంలో డీడీఎంహెచ్‌వో రజితకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్ జాతా ఈ నెల 18న సిరిసిల్లకు చేరుకుంటుందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలోని ఆశ కార్యకర్తలు విధులకు రాలేరని చెప్పారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో అక్రమాలు జరుగుతున్నప్పటికీ.. అధికారులు పట్టించుకోవడం లేదని జాతీయ మానవ హక్కుల మండలి (ఎన్‌జీవో) అధ్యక్షుడు జె నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, మెడికల్ షాపులు, ఫీజుల నియంత్రణపై అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని కోరారు. ఇక్కడ ఉపాధ్యక్షుడు పయ్యావుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జీ సత్తయ్య, జే శ్రీనివాస్, కరుణాకర్ ఉన్నారు.

చేతి కర్ర ఇప్పించండి

ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన దివ్యాంగుడు బండిపల్లి చంద్రాగౌడ్ తనకు చేతికర్ర ఇప్పించాలని ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కోరారు. స్పందించిన కలెక్టర్ చేతికర్ర అందించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు సూచించారు.

స్పీడ్ బ్రేకర్లు వేయించాలి

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిలో బద్దెనపల్లి గ్రామ మెయిన్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయించాలని జీ అభినయ్‌గౌడ్ అనే యువకుడు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కోరారు. విద్యార్థులు స్కూళ్లకు వెళ్లేటప్పుడు, గ్రామస్తులు రోడ్డు దాటేటప్పుడు భయాందోళనలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్స్ వేయించాలని విజ్ఞప్తి చేశారు.

డబుల్ బెడ్రూం ఇప్పించండి

సిరిసిల్ల రాజీవ్‌నగర్ 11వార్డుకు చెందిన కోట కావ్య తనకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేసింది. తాను సిరిసిల్లలో అద్దె ఇంట్లో ఉంటున్నానని, తన పేరు డ్రాలో వచ్చిందని, ఫైనల్ లిస్టు (05038) లో తన పేరు ఉన్నా.. డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించలేదని తెలిపింది. మున్సిపల్ ఆఫీస్‌లో అడిగితే కలెక్టర్ స్వయంగా ఇస్తారని సమాధానం చెప్పారని తెలిపింది.

అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పించండి

ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టును ఇప్పించాలని సిరిసిల్ల బద్ధం ఎల్లారెడ్డి నగర్ 31వ వార్డుకు చెందిన యెల్లె హిమశ్రీ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కోరింది. తాను నిరుపేద మహిళనని, ఎంఎస్‌సి పూర్తి చేసి నిరుద్యోగిగా ఉన్నానని తెలిపింది. 31వ వార్డులో అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు శ్రీ కూస మహేష్, S/o. మల్లేషం, R/o. రెడ్డివాడ, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన భాళీస్థలంలు వరుసగా దీని విస్తీర్ణంలు: 1) 122 చ॥గ॥ మరియు 2) 508 చ॥గ॥ దీని మొత్తం విస్తీర్ణం: 630 చ॥గ॥లు, దీని సర్వే నెం. 1405/B, H.No. 2-6 ఇంటి దగ్గర చంద్రంపేట/ సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా నాక్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబందించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో. ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికీ అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 16-12-2024 స్థలము: సిరిసిల్ల

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

కాలువ ఇలా..

నీరు పారేదెలా?

చెత్తాచెదారంతో నిండిన ఎగువమానేరు ప్రాజెక్టు ప్రధాన కాలువ

ముస్తాబాద్, డిసెంబర్ 16: యాసంగి పంటలపై ఆశలు పెట్టుకున్న ఎగువమానేరు ప్రాజెక్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలోని 22 గ్రామాల్లో 18 వేల ఎకరాల్లో ఆయకట్టు ఉండగా, ఎగువమానేరు ప్రాజెక్ట కింద 9 గ్రామాల్లో 8,800 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఎగువమానేరు నీటిపై ఆశలు పెట్టుకొని రైతులు సాగు పనులు ప్రారంభించారు. అయితే ఈ నెల 14న ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కాలువల్లో చెత్తాచెదారం పేరుకపోవడం, తుంగ, తూములు, డిస్ట్రిబ్యూటర్లు మరమ్మతులకు నోచుకోక చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందో.. లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకునే వారే కరువు

నిజాంకాలంలో నిర్మించిన ఎగువమానేరు ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు గుండెకాయ లాంటిది. ప్రాజెక్ట్ పరిధిలో ప్రధాన ఆయకట్టు ముస్తాబాద్ మండలంలోనే అధికంగా ఉన్నది. మండలంలోని గోపాల్‌పల్లి, రాంరెడ్డిపల్లె, కొండాపూర్, గూడెం, గూడూర్, నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది గ్రామాల్లో 8,800 ఎకరాల్లో ఆయకట్టుకు నీరు అందుతుంది. రైతులు సాగు పనులకు ముందే ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారే కరువయ్యారు.

నిధులు మంజూరు చేయాలి

కాలువలు, తూములకు మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. పోతుగల్ పరిధిలోనే సుమారు 5వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రతి సీజన్‌లో నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే కాలువల మరమ్మతులు, షెటర్లు తూములు బాగు చేయాలి.

- తన్నీరు బాబురావు, పీఏసీఎస్ చైర్మన్ (పోతుగల్)

- మానేరు ప్రధాన కాలువల్లో చెత్తాచెదారం
- ఆయకట్టుకు నీరందుతుందో లేదోనని రైతుల ఆందోళన
- వెంటనే శుభ్రం చేయాలని డిమాండ్

కాలువలు శుభ్రం చేయాలి

కాలువల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, మట్టిని తొలగిస్తేనే చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మా గ్రామం చివరి ఆయకట్టు. అధికారులు ముందు కాలువలు శుభ్రం చేసి, షటర్లు బాగుచేసి నీరు విడుదల చేయాలి. గతంలో పలు సార్లు అధికారులకు విన్నవించినా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కాలువల పరిస్థితితో చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమే.

- ఈసరి కృష్ణ, మాజీ సర్పంచ్ (తెర్లుమద్ది)

తూములు బాగు చేయాలి

గతంలో చాలాసార్లు నీటి నిర్వహణ సంఘం అధ్యక్షుడిగా పని చేసిన. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట చెరువులో 12ఫీట్లకు పైగా నీరుంటేనే కాలువల ద్వారా చివరి ఆయకట్టు తెర్లుమద్ది వరకు నీరు చేరుతుంది. మల్లారెడ్డిపేట చెరువులో నీటి మట్టం తగ్గితే నీటి ప్రవాహం తగ్గి ఇబ్బందులు వస్తాయి. అధికారులు కాలువలు, తూములు బాగుచేసి చెరువుల్లో నీటి మట్టం తగ్గకుండా చూడాలి. నీటిపారుదల శాఖ అధికారులు ఆయకట్టును తైబంది చేసిన కాలువలు, తూంలు బాగు చేయాలి.

- కలకొండ కిషన్‌రావు, మాజీ సర్పంచ్ (తెర్లుమద్ది)

నేడు బీఆర్ఎస్ నిరసన

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 16: లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి.. వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి బేడీలు వేసి జైలులో నిర్బంధించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనపై మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు రైతులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉదయం 11 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల పేరిట కాంగ్రెస్ నేతల ఆగడాలు

వేములవాడ రూరల్, డిసెంబర్ 16: ముంపు గ్రామాల్లో నిర్వాసితుల నుంచి గతంలో సేకరించిన దరఖాస్తుల్లో సరైన పత్రాలు లేవని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తిరస్కరించగా, కాంగ్రెస్ నేతలు ఇంటింటికెళ్లి మళ్లీ అర్జీలు స్వీకరించడంలో ఆంతర్యం ఏమిటని మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి ప్రశ్నించారు. సోమవారం ఆయన అనుపురంలో మాట్లాడారు. గతంలో పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 3 వేల మంది దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు వేములవాడ ఆర్డీవో ఇటీవల నోటీసులు అందజేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొనడం ఏంటని మండిపడ్డారు. ఆర్డీవో, తహసీల్దార్‌కు తెలియకుండా సీఎంవో ఆఫీస్ నుంచి ఎవరు దరఖాస్తు తీసుకోమన్నారో ప్రజలకు తెలుపాలన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద పని పాపను ఆడిస్తున్న మహిళా హోంగార్డు

తల్లికి పరీక్ష.. బిడ్డకు పోలీస్ సిబ్బంది ఆలన

రాష్ట్ర వ్యాప్తంగా రెండోరోజు గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం వేములవాడలోని ధార్మిక డిగ్రీ కళాశాలలో ఓ మహిళా అభ్యర్థి తన రెండు నెలల పాపతో కలిసి పరీక్ష రాసేందుకు కేంద్రానికి వచ్చింది. తల్లి పరీక్ష రాసేందుకు కేంద్రంలోనికి వెళ్లగా, నానమ్మ దగ్గర ఉన్న పాప ఏడ్చింది. దీంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మహిళా హోంగార్డు షాహనాజ్ గమనించి పాపను ఎత్తుకొని ఆడించింది. తల్లి పరీక్ష రాయగా, మహిళా హోం గార్డు చిన్నారి ఆడించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

- వేములవాడ, డిసెంబర్ 16

భర్తకు పదేండ్ల జైలు

గాంధీచౌక్, డిసెంబర్ 16: భార్య మృతికి కారణమైన భర్తకు పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. గంభీరావుపేటకు చెందిన లక్కం రాజనర్సవ్వ కూతురు భాగ్యకు 2020లో కడారి రాజశేఖర్‌తో వివాహమైంది. కొద్ది రోజుల తర్వాత రాజశేఖర్ భార్యను శారీరకంగా వేధిస్తూ, తీవ్రంగా కొట్టడంతో 12 డిసెంబర్ 2020న కరీంనగర్ ప్రతిమ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి రాజశేఖర్‌ను రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుళ్లు నవీన్, శ్రీనివాస్ 15మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంటం శ్రీనివాస్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువుకావడంతో నిందితుడు రాజశేఖర్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

24న దిశ సమావేశం

కలెక్టరేట్, డిసెంబర్ 16: కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలోని హాల్‌లో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బీ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చైర్మన్‌గా జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కార్మిక క్షేత్రంలోని పేదల నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాష్ట్ర నాయకుడు మూషం రమేశ్ మాట్లాడుతూ బీవైనగర్, రాజీన్‌నగర్, పద్మనగర్, సుందరయ్యనగర్ వార్డుల్లోని పేదలకు ప్రభుత్వం ఉచితంగా నివేశన స్థలాలు ఇచ్చిందని, వీటికి రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పించకపోవడంతో ఎలాంటి రుణసౌకర్యాలు వర్తించడం లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించేలా మున్సిపాలిటీ తీర్మానం చేస్తూ ప్రభుత్వానికి పంపించినప్పటికీ స్పందన లేదన్నారు. నివేశన స్థలాలు పొందిన ప్రజలతో సంతకాలు సేకరించి విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, సిరిమల్ల సత్యం, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

బీవైనగర్‌లో సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కేటీఆర్‌కు వివాహ పత్రిక అందిస్తున్న మాజీ ఎంపీటీసీ దంపతులు

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను తంగళ్లపల్లి మండలం సారంపల్లి మాజీ ఎంపీటీసీ దంపతులు గుగ్గిళ్ల లావణ్య ఆంజనేయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వాన పత్రిక అందించారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 16: జిల్లాలో సోమవారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 26సెంటర్ల ఏర్పాటు చేశారు. 7,163 మంది అభ్యర్థులకు గానూ 3,557 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం పేపర్-3, మధ్యాహ్నం పేపర్-4 పరీక్షలు జరిగాయి. ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య 144 సెక్షన్ అమలు చేశారు.

ఘనంగా విజయ్ దివస్ వేడుకలు

రుద్రంగి, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో ఉండి.. ఆనాటి సైనిక సామర్థ్యాలకు అభివాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు మాట్లాడుతూ, 1971 డిసెంబర్ 16న పాకిస్థాన్‌ను భారత సైన్యం చిత్తుగా ఓడించి.. దాదాపు 93వేల మంది పాక్ సైనికుల లొంగుబాటుతో విజయకేతనం ఎగురవేశారన్నారు. ప్రతి విద్యార్థి దేశంపై ప్రేమ, అభిమానం, గౌరవం పెంచుకోవాలన్నారు. ఇక్కడ కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

లైసెన్స్ మేళాను వినియోగించుకోవాలి

రుద్రంగి, డిసెంబర్ 16: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్దేశిత ఆన్‌లైన్ రుసుముతో నిర్వహిస్తున్న ద్విచక్ర వాహన లైసెన్స్ మేళాను మండలంలో లైసెన్స్ లేని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ లేని 18 ఏండ్లు నిండిన యువతీయువకుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహన లైసెన్స్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ నెల 19లోగా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్ఐ అశోక్ సూచించారు.

ధర్నాను విజయవంతం చేయండి

కలెక్టరేట్, డిసెంబర్ 16: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మేనిఫెస్టో అమలు చేయాలని కోరుతూ జిల్లా సీఐటీయూ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు తరలిరావాలన్నారు. ఇక్కడ బండి దేవమ్మ, తంగళ్లపల్లి లక్ష్మి, వెంకటలక్ష్మి, లింగురాధ, తదితరులు ఉన్నారు.

వైన్స్‌లో చోరీ: ఒకరి అరెస్ట్

గంభీరావుపేట, డిసెంబర్ 16: లింగన్నపేట రేణుక వైన్స్‌లో రెండు నెలల క్రితం దొంగతనానికి పాల్పడిన ఒకరిని గుర్తించి సోమవారం అరెస్ట్ చేశామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వైన్స్ షట్టర్ తాళం పగలగొట్టి రూ.10వేల నగదు, మొబైల్ ఫోన్, నాలుగు ఫుల్ బాటిళ్ల మద్యాన్ని ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గంభీరావుపేట బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని అరెస్ట్ చేశామన్నారు.

బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, డిసెంబర్16: బావుపాయిపేటకు చెందిన సీనియర్ పాత్రికేయుడు మల్లి కార్జున్, బీఆర్ఎస్ నేత తిరుపతి తల్లి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానూభూతి వ్యక్తం చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ నర్సయ్య, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చీటి సంధ్య, నేతలు రాఘవరెడ్డి, పల్లం నర్సయ్య ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు పరామర్శించారు.

'విద్యుత్ ప్రజావాణి'తో సత్వర పరిష్కారం

ముస్తాబాద్, డిసెంబర్16: విద్యుత్ ప్రజావాణితో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసమే సెస్ పాలక వర్గం సెస్ కార్యాలయాల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. వినియోగదారులు వారి సమస్యలు నేరుగా చెప్పుకోవడంతోపాటు పరిధిలోని సమస్యలు తక్షణ పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ స